క్లుప్తంగా

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



దివ్యాంగ పిల్లలకు ఉపకరణాలను పంపిణీ చేస్తున్న పీఓ వెంకటరమణ

రొంపిచెర్ల: భవిత పాఠశాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను సర్వ శిక్షా అభియాన్ పీఓ వెంకటరమణ చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. దివ్యాంగ పిల్లల కోసం ప్రభుత్వం వివిధ రకాల ఉప కరణాలను మంజూరు చేసిందని ఉపాధ్యాయురాలు అములు తెలిపారు. ఇద్దరు పిల్లలకు వినికిడి యంత్రాలు, ఒక బ్యాటరీ సైకిల్, ఒక రోలిటర్న్ పిల్లల తల్లిదండ్రుల సమక్షంలో ఉచితంగా అందజేసినట్టు చెప్పారు. ఈ ఉప కరణాలను పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆర్వో ప్లాంట్‌ల వితరణ



బాలుర వసతి గృహంలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కళాశాల సిబ్బంది

కుప్పంరూరల్: పట్టణంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న బాల, బాలికలకు నీటి శుద్ధి యంత్రాలు(ఆర్వో ప్లాంట్)ను బీసీఎన్ విద్యాసంస్థల సీఈఓ సాగర్‌రాజ్ ఉచితంగా అందజేశారు. పట్టణంలోని బాలికల వసతి గృహానికి ఆర్వో మిషన్, నీటి మోటారును వితరణ చేశారు. అదేవిధంగా సాంఘిక సంక్షేమ బాలుర వసతి వసతి గృహానికి ఆర్వో మిషన్ వితరణగా అందించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో 30 మంది విద్యార్థులు, బీసీఎన్ సంస్థల ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమాల్లో బీసీఎన్ విద్యాసంస్థల చైర్మన్ బీసీ నాగరాజు, చైర్‌పర్సన్ శాంతానాగరాజు, వైస్ చైర్మన్ డా.సునీల్‌రాజ్, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు ఉద్యోగ విరమణ సన్మానం



నగేష్ దంపతులను సన్మానిస్తున్న టీచర్లు

పెద్దపంజాణి: మండలంలోని కొళత్తూరు ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వీకే నగేష్‌ను శుక్రవారం పలు పాఠశాలల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. నగేష్ దంపతులకు పూలమాల వేసి సత్కరించారు. ఆయన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసులు, స్వర్ణలత, రెడ్డివిజయ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ ఇఫ్తార్.. చీరల పంపిణీ



కొలమాసనపల్లెలో ఇఫ్తార్ విందు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె మసీదులో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. గ్రామస్తులు అక్కడి ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఇక, పట్టణానికి చెందిన కౌన్సిలర్ రహీంఖాన్ పేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మైనారిటీ నాయకులు షరీఫ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరత్నం, మాజీ సర్పంచ్ సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న రహీంఖాన్

పాడికి ఆవుకు ప్రాణం పోసి..

చిత్తూరు రూరల్(కాణిపాకం): మురుగునీటిలో పడిన ఓ పాడి ఆవుకు స్థానికులు ప్రాణం పోశారు. చిత్తూరు నగరం బజారువీధిలోని ఓ కాలువలో ఆవు మేత మేస్తూ కాళ్లు జారి పడిపోయింది. గమనించిన స్థానికులు ఆవును కాపాడే ప్రయత్నం చేశారు. తాడు సాయంతో కాలువ నుంచి ఆవును పైకి తీశారు. కాగా మురుగు నీటి కాలువలకు పైకప్పులు అమర్చాలని స్థానికులు కోరుతున్నారు.



ఆవును కాపాడిన స్థానికులు

వసతి ప్రాప్తిరస్తు..!

- కళాశాలల హాస్టళ్లకు పక్కా భవనాలు
- బాలికలు, బాలుర హాస్టళ్లకు సర్వే చేసిన అధికారులు
- నిర్మాణానికి కేంద్రం నుంచి రూ.6కోట్లు మంజూరు
- గత ప్రభుత్వం చొరవతో ప్రస్తుతం తీరనున్న హాస్టల్ విద్యార్థుల సమస్య
- త్వరలో కొత్త భవనాల నిర్మాణం





పలమనేరులో అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఎస్సీ బాలికలు, బాలుర కళాశాల హాస్టల్ భవనాలు

పలమనేరు: ఎన్నో ఏళ్లుగా అద్దె భవనాల్లో ఇబ్బందులు నడుమ ఉంటున్న కళాశాల విద్యార్థుల పక్కా హాస్టల్ భవనాల సమస్య త్వరలో తీరనుంది. ఈ దిశగా ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు పలమనేరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ, స్థానిక ఎస్సీ హాస్టళ్ల ఖాళీ స్థలంలో రెండు కళాశాల విద్యార్థుల వసతి గృహాలను నిర్మించేందుకు ఇటీవల మార్కింగ్ చేశారు. పీఎం అనుచిత్ జాతి అభ్యుదయ్ యోజన పథకం కింద ఒక్కో హాస్టల్ భవన నిర్మాణానికి రూ.3కోట్ల చొప్పున మంజూరైంది. ఇక్కడి కళాశాలలో చదివే ఎస్సీ విద్యార్థినీ విద్యార్థులు గత కొన్నేళ్లుగా అద్దె భవనాల్లో అరకొర సౌకర్యాల నడుమ సతమవుతున్నారని గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టణంలో హాస్టళ్ల కొత్త భవనాలకు ప్రతిపాదనలు పంపింది. దీంతో వీటికి నిధుల మంజూరై పనులు మొదలు కానున్నాయి.

ఇప్పటి వరకూ సమస్యల నడుమే హాస్టల్ విద్యార్థులు

సాంఘిక సంక్షేమ శాఖ నిర్వహించే ఎస్సీ కళాశాల వసతి గృహాలు ఇక్కడ రెండున్నాయి. బాలికల హాస్టల్ పట్టణంలోని గుడియాత్తం రోడ్డులో, బాలుర హాస్టల్ మదనపల్లె రోడ్డులో ఉన్నాయి. వీటిలో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. బాలికల కళాశాల హాస్టల్‌లో 45మంది ఉండగా, బాలుర హాస్టల్‌లో 70మంది వరకూ ఉన్నారు. ప్రధానంగా బాలుర హాస్టల్ ఇక్కడి చెరువుకు ఆనుకుని ఉంది. దీంతో తీవ్రమైన దుర్వాసన నడుమ విద్యార్థులు ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల ఈ హాస్టల్‌ను అధికారులతో సందర్శించిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి సైతం సౌకర్యాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వసతులు మెరుగు పరచాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో కొత్త హాస్టల్ భవనాల మంజూరుతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.6 కోట్లతో రెండు చోట్ల భవనాలు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుకవైపు ఉన్న మైదానంలో బాలికల కళాశాల హాస్టల్‌ను, బాలుర హాస్టల్‌ను గుడియాత్తం రోడ్డులోని ఎస్సీ-1, ఎస్సీ 2 హాస్టళ్ల వెనుక వైపు ఉన్న స్థలంలో నిర్మించనున్నారు. ఇప్పటికే స్థలాలను ఎంపిక చేశారు. నాలుగు రోజుల క్రితం ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈఈ ఎన్ భాస్కర్, ఏఈ శ్రీకాంత్‌రెడ్డి భవనాల నిర్మాణాలకు మార్కింగ్ ఇచ్చారు. వచ్చే విద్యా సంవత్సరానికి కొత్త హాస్టల్ భవనాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. దీనిపై ఏఎస్‌డబ్ల్యూఓ హైమవతిని వివరణ కోరగా..త్వరలో హాస్టల్ భవనాల నిర్మాణ పనులు మొదలు కానున్నట్టు చెప్పారు.



కొత్త హాస్టళ్లు నిర్మించనున్న స్థలాలివే

నోటీస్ బోర్డు

నేడు మార్కెట్ వేలం

సదుం: సదుం మేజర్ పంచాయతీ వనరులకు శనివారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ హసీనా, సర్పంచ్ ఉషారాణి తెలిపారు. స్థానిక సచివాలయం-2లో వారపు సంత, బస్టాండు, షాపింగ్ కాంప్లెక్స్ గదులు, దినసరి మార్కెట్‌కు వేలం నిర్వహిస్తామన్నారు. గతంలో నిర్వహించిన వేలంలో కొందరు గందరగోళానికి పాల్పడడంతో వాయిదా పడింది. ఈ నేపథ్యంలో డిపాజిట్ చెల్లింపుదారులు మాత్రమే వేలానికి హాజరు కావాలని ఈఓ కోరారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న సజ్జాద్‌బాషా

పుంగనూరు: రంజాన్ పండుగ పురస్కరించుకుని శుక్రవారం పట్టణ కాంగ్రెస్ నాయకుడు సజ్జాద్‌బాషా, వాహీద్ వెల్ఫేర్ ట్రస్ట్ నిర్వాహకులు 200 పేద కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. పేద ముస్లింలు పండుగను ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ తోఫా పంపిణీ చేసినట్టు చెప్పారు.

నల్ల బ్యాడ్జీలతో ముస్లింల నిరసన



రొంపిచెర్ల: నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు



కల్లూరు మసీదు ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

- వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్
- ముస్లింల హక్కులను కేంద్రం కాలరాస్తోందని ఆగ్రహం

రొంపిచెర్ల: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా స్థానిక చిన్న మశీదుకు చెందిన ముస్లింలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. మశీదులో నల్ల బ్యాడ్జీలు ధరించి మధ్యాహ్నం ప్రార్థనల అనంతరం ఈ కార్యక్రమం నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలన్నారు. ఈ బిల్లుతో ముస్లింల హక్కులకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు ముస్లిం సమాజానికి చెందినవని, వాటిపై ప్రభుత్వ జోక్యం అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ బిల్లుతో ముస్లిం మైనారిటీ హక్కులను హరించేందుకు కేంద్రం కుటిల యత్నం చేస్తోందని ఆరోపించారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ముతవల్లీలు, ఇమామ్‌లు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం యువకులు నిరసన పాల్గొన్నారు.

కల్లూరులో..

పులిచెర్ల(కల్లూరు): వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మండలంలోని కల్లూరు ముస్లింలు ఏకమై శుక్రవారం నమాజ్ తరువాత మసీదు వద్ద చేతికి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తోందని మండిపడ్డారు.

పుంగనూరులో..



పుంగనూరులో..

పుంగనూరు: వక్ఫ్ బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పుంగనూరులో ఎస్‌డీపీఐ ప్రధాన కార్యదర్శి యూసుఫ్ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. నల్లచట్టాలు రద్దు చేయాలని నినాదాలు చేశారు.

రూ.36 వేల రికవరీకి ఆదేశం

- మరో రూ.36వేల జరిమానా
- సామాజిక తనిఖీ బృందం నివేదికతో చర్యలు



నివేదిక వెల్లడిస్తున్న సామాజిక తనిఖీ బృందం

సదుం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం 18వ ఉపాధి హామీ సామాజిక ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. 18 పంచాయతీల పరిధిలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు చేసిన ఉపాధి, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, హార్టికల్చర్ శాఖల 1901 పనులను ఈనెల 13 నుంచి సామాజిక తనిఖీ బృందం పరిశీలించింది. ఈ పనులకు మొత్తం రూ.11.93 కోట్లు వ్యయం చేశారు. పరిశీలనతో తేలిన అంశాలకు సంబంధించి బహిరంగ సభలో నివేదిక వెల్లడించారు. పలువురు ఫీల్డ్ అసిస్టెంట్‌లు జాబ్‌కార్డులు అప్‌డేట్ చేయకపోవడం, రోజ్‌గార్ దివస్ నిర్వహించకపోవడంపై డ్వామా పీడీ రవికుమార్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్‌కార్డు కూలీలందరికీ పని కల్పించేలా చూడటంతో పాటు నిబంధనలను సక్రమంగా అమలు చేస్తూ పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. పనులలో అవకతవకలపై రూ.36,387 రికవరీకి ఆదేశించడంతో పాటు, రూ.36 వేలను జరిమానా విధించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ శివయ్య, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ మాధవి, ఏపీడీ శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిబాబు, ఏపీఓలు శివశంకర్, శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ ధనుంజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనలతో ఉపవాస దీక్షల విరమణ



పుంగనూరు రాతిమసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పుంగనూరు: రంజాన్ పండుగ ఉపవాస దీక్షల్లో చివరి శుక్రవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదుల్లో ఖురాన్ పఠనం చేశారు. అల్లాహ్‌ను ప్రార్థించి అన్నదానం చేశారు. సాయంత్రం ఇఫ్తార్ కార్యక్రమాలను పట్టణంలోని 29 మసీదుల్లో నిర్వహించి దీక్షలు విరమించారు. ఇక, చంద్రుడు కనిపిస్తే సోమవారం లేదా మంగళవారం రంజాన్ పండుగను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం





ఉగాది పురస్కారాలను అందుకున్న వారితో నిర్వాహకులు, గీతాంజలి స్మారక పురస్కారం

పలమనేరు: తెలుగుభాషా, సంస్కృతుల పరిరక్షణకు ప్రతి తెలుగు వాడు ఉగాది సందర్భంగా ప్రతినబూనుదామని తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కళామందిరంలో ముందస్తు ఉగాది పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పాఠశాలలో తెలుగు భాషను బోధించేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యతను కల్పించాలన్నారు. ప్రముఖ రచయిత పలమనేరు బాలాజీకి కరణం విమల ఏర్పాటు చేసిన గీతాంజలి స్మారక పురస్కారాన్ని, సీఏ ఎస్ భాస్కర్, డాక్టర్ రాజారెడ్డి, డాక్టర్ వాసు, డాక్టర్ సుశీల, కిరణ్‌కుమార్, గురుమూర్తి, బాలాజీ, చంద్రశేఖర్, సరిత, నరసింహులు నాయుడు, రెడ్డెప్పనాయుడు, శక్తి ప్రసాద్‌లకు శ్రీవిశ్వా వసునామ ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. సమితి కార్యదర్శి పుష్ప, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు



పట్టణంలోని నీటి సంపులను పరిశీలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు: వేసవి దృష్ట్యా పట్టణంలో మంచినీటి సమస్య పరిష్కారానికి మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి శుక్రవారం ఎద్దుల సంతవీధిలోని పంప్‌హౌస్, పట్టణంలోని ఓవర్‌హెడ్ ట్యాంకులను పరిశీలించారు. ఇప్పుడున్న నీటి లభ్యత, కావాల్సిన నీటి అవసరాలపై తగు చర్యలు తీసుకున్నామని, ఈ దిశగా ట్రాక్టర్లతో పట్టణంలో మంచినీటి సరఫరా చేయనున్నట్టు చెప్పారు. ట్యాంకులను శుభ్రం చేసి క్లోరిన్ పరీక్షలు చేయించారు. ప్రధానంగా పైపు లైన్ల లీకేజీలు, నీటి వృధాను అరికట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ సురేష్‌బాబు, ఏఈ స్నేహప్రియ, సచివాలయాల అమెనిటీస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఆక్రమణ దుకాణాలను తొలగించేందుకు సర్వే

బైరెడ్డిపల్లె: స్థానిక మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలను తొలగించేందుకు శుక్రవారం రెవెన్యూ అధికారులు, ఎస్‌ఐ పరుశురాముడు సర్వే చేశారు. రహదారికి ఇరువైపులా దుకాణాలు రోడ్డు స్థలంలోకి ఉండడంతో ట్రాఫిక్ సమస్యతో పాటు ద్విచక్రవాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని, ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో అక్రమ దుకాణాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దుకాణదారులు స్వచ్ఛందంగా దుకాణాలను తొలగించుకోవాలని, లేనిపక్షంలో తామే తొలగిస్తామని హెచ్చరించారు.



మెయిన్‌రోడ్డులో సర్వే చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు, ఎస్‌ఐ



శ్యామ్‌సుందర్‌రాజును సన్మానిస్తున్న ఎస్సీ నాయకులు

ఆత్మీయ సన్మానం

పలమనేరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన శ్యామ్‌సుందర్ రాజును శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎస్సీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎర్రబల్లి శ్రీనివాసులు, మహేష్, అనిల్, పవన్, సేటు, గణేష్, కొండారెడ్డి, శ్రీనివాసులు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

జీపీటీపీ.. సర్వేలతో బీపీ..

చిత్తూరు రూరల్(కాణిపాకం): పంచాయతీ కార్యదర్శులకు చేతినిండా30 రకాల సర్వేలతో పడరాని పాట్లు పడుతున్నారు. కొన్ని నెలలుగా సర్వేల పేరిట పల్లెల్లో పరుగులు పెడుతున్నారు. పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. అలాగే అదనపు పనులు తలకు మించిన భారంగా మారుతున్నాయి. దీంతో వారు రాత్రి ఇంటికి చేరుకునే సమయానికి బీపీ పెరిగిపోతోంది. చిత్తూరు ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం రాత్రి 8.30 గంటల వరకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు కంప్యూటర్లకు అతుక్కుపోయారు. ఇదేమని అడిగితే వాళ్లు నోరు విప్పని పరిస్థితి. తీరా మండల అధికారులను విచారిస్తే..అది జీపీటీపీ (గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక)గా చెప్పుకొచ్చారు. కొన్ని రోజులుగా ఈ జీపీటీపీ పనిమీద ఆన్‌లైన్ నమోదులో ఇలా బిజీగా ఇమిడిపోయారట!



చిత్తూరు ఎంపీడీఓ కార్యాలయంలో...

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే వదలం



ఆక్రమణలు తొలగించి రోడ్డు ఏర్పాటు చేయిస్తున్న ఆర్డీఓ, రెవెన్యూ సిబ్బంది

కుప్పంరూరల్: ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని .. ఒకవేళ కాదని ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటే తాము ఎప్పుడైనా స్వాధీనం చేసుకోవడం ఖాయమని కుప్పం ఆర్డీఓ శ్రీనివాసరాజు హెచ్చరించారు. శుక్రువారం మండల పరిధిలోని సజ్జలపల్లి గ్రామంలో సర్వే నంబర్ 10లో ఆక్రమణకు గురైన స్థలాన్ని సర్వే చేసి 5 ఇళ్లకు రోడ్డు ఏర్పాటు చేశారు. లబ్ధిదారుల నుంచి వచ్చిన వినతి మేరకు తహసీల్దారు చిట్టిబాబుతో కలిసి ఆయన శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. సర్వే నెం.10లో ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకుని, శాశ్వతంగా మట్టి రోడ్డు ఏర్పాటు చేయించారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

సీపీఎం నాయకుల ఆందోళన



ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

- స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్

పలమనేరు: ఇళ్లకు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద పట్టణ సీపీఎం నాయకులు శుక్రవారం ఆందోళన చేశారు. పట్టణ కార్యదర్శి గిరిధర్ మాట్లాడుతూ, సెకీ ఒప్పందంతో రాష్ట్ర ప్రభుత్వం పేదలపై భారం మోపుతోందని, తాము అధికారంలోకి వస్తే స్మార్ట్‌మీటర్లను తొలగిస్తామన్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు యథేచ్ఛగా వాటిని బిగిస్తోందని విమర్శించారు. కరెంట్ చార్జీలను పెంచమన్న కూటమి నేతలు ఇప్పుడు ఇష్టానుసారంగా పెంచడంపై ప్రజలు మండిపడుతున్నారని, మాట మీద నిలబడిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడం తథ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్, శ్రీరామయ్య, ఖైరున్నీసా తదితరులు పాల్గొన్నారు.